# హోదాలూ - పదవులూ

"నాకోసం ఎవరైనావచ్చి డ్రాయింగురూములో కూర్చున్నారేమోచూడు వీరమ్మా!" కేకపెట్టింది కనకదుర్గమ్మ గదిలోనుంచి.

"లేదమ్మా? ఎవరూరాలేదు"

"రాలేదా? కాంతమ్మ వస్తాననిచెప్పింది నిన్న సాయంత్రం?"

"ఏమోమరి రాలేదు" వీరమ్మ వీధివాకిలిదాటి గేటువరకూవెళ్ళి చూసి వచ్చింది.

గడియారం మూడుగంటలు కొట్టింది.

"మూడుగంటలేనా? ఇంకా నేను ఏఐదుగంటలో అయిందనుకుంటున్నాను" అంటూ కనకదుర్గమ్మ హాల్లో సోఫామీదకూర్చుని పేపరు తిరగవేస్తున్నది.

"అమ్మా, కాఫీకి లోపలికివస్తారా ఇక్కడికే తీసుకురమ్మంటరా?" వీరమ్మ తలుపుదగ్గర నిలబడ్డది.

"లోపలికేవస్తాను" అంటూ లోపలికివెళ్ళి కాఫీతాగి, గదిలోకివెళ్ళి అద్దం ముందర నిలబడి చీరెమడతలు సర్దుకుని, తలలోపూలు సవరించుకుని మళ్ళీవచ్చి సోఫామీదకూర్చుంది.

గాలికికర్టెను ఇటూఅటూ కదులుతూ ఎగురుతున్నది.

మనిషివచ్చిన జాడ కనబడలేదు.

వీధిలో పూలదండల కేకలు వినబడుతున్నాయి.

కనకదుర్గమ్మ అసహనంతో ఇటూఅటూచూస్తూ సోఫామీదకూర్చుంది.

లోపలనుంచి తెరతొలగించుకుని వామనరావు బైటికివచ్చాడు.

"నేనలా క్లబ్బువైపుకు వెళ్తాను. వచ్చేటప్పటికి ఏడుగంటలుకావచ్చు." అంటూ ముందుకు అడుగువేశాడు.

"క్లబ్బుకేనా సూటువేసుకున్నారు? టెన్నిసుఆడటం మానేశారుగా? ఇంకేం చేస్తారు క్లబ్బులో?"

"టెన్నిసు లేకపోతే ఇంకేమీ ఆటలు ఉండవా?

"అయితే పేకాటా?"

"పేకముక్కలు కాదు. చెస్ ఆడతాము నలుగురంకలిసి. ఒక టేబుల్‌కి నాలుగు కుర్చీలుంటాయి. నాలుగు కుర్చీలలో నిజానికి ఆడేది ఇద్దరేఉంటారు. మిగతా ఇద్దరూ చూస్తూఉంటారు."

"అయితే మీతో ఉండేముగ్గురూ మీలాంటివాళ్లేనా?"

"నాలాంటి వాళ్ళంటే?"

''అంతా రిటైరయినవాళ్లేనా అని''

''కాదు, రిటైరయినవాళ్ళం ఇద్దరమే. మిగతావాళ్ళు సర్వీసులోఉన్నారు. చెస్ఆడటమంటే ఎంతో ఆలోచనకావాలి పావులు నడపటంలోనేఉంది తెలివంతా" చేతిగడియారంచూసుకుని "వాళ్ళు నాకోసం ఎదురుచూస్తారు" అంటూ వెళ్ళాడు. రెండునిమిషాలకు కారు స్టార్టుచేసిన చప్పుడయింది.

కనకదుర్గమ్మకు ఉసూరుమనిపించింది.

అక్కడేకూర్చుని వీధివాకిలివైపు చూస్తున్నది.

"కాంతమ్మగారొచ్చారా అమ్మా" వీరమ్మ అడిగింది గడపకు అవతలగా నిలబడి.

కనకదుర్గమ్మ ఉలిక్కిపడి "ఎవ్వరూరాలేదు" అంటూ పత్రిపలికింది.

"నాకు కూరగాయల మార్కెటుదగ్గర కారులోవెళ్ళతూ కనబడ్డది. వెంబడి ముగ్గురున్నారు. నేను ఇక్కడికే వచ్చారనుకున్నాను."

''రాలేదు ఏంపనిమీద వెళ్తున్నదో?'' కనుబొమలు ముడిచింది.

''ఇవాళేకాదమ్మా, నిన్నా మొన్నాకూడా ఎటోవెళ్తూ కనబడ్డది. ఆమెవెంట నలుగురున్నారు. నడిచేవెళ్తున్నారు.''

"ఆఁ హాఁ" అంటూలేచింది కనకదుర్గమ్మ.

"రోజూ అట్లా వేళకానివేళకూడావచ్చి మిమ్మల్ని భోజనమయినా సరిగా చేయకుండా, గంటలకొద్దీకూర్చుని కాఫీలుతాగుతూ టిఫిన్లుతింటూ ఉండేవారుకదా ఆ ఇందిరమ్మ, ఆ కనకవల్లి, ఆ సుందరమ్మ? మళ్ళీ రావటంలేదే ఈ వారం రోజులనుంచీ?''

"ఏమో? ఏంకొత్తపనులు తగిలాయో? నేను వాళ్ళకు, గ్రామాలకువెళ్ళి అక్కడి స్త్రీలపరిస్థితి చూసి రమ్మందామనుకున్నాను. రాలేదు మరి" అన్నది ఆదుర్దాను కప్పిపుచ్చుకుంటూ.

"ఎలాపడితే అలా పిచ్చిదానిలా వెలిసిపోయిన గుడ్డలతోవచ్చి, వెర్రిదానిలా పిచ్చివాగుడు వాగే కాంతమ్మకు-కొంగుపట్టుకుని వెంటవెంటతిరిగే కాంతమ్మకు-ఏంపని తగిలిందో అట్లా కార్లలో తిరుగుతున్నది? కొందరికి విశ్వాసముండదు. ఎంతతిరిగినా ఒక ఐదునిమిషాలు వచ్చిపోవచ్చుకదా?'' అంది వీరమ్మ.

ఈ మాటలతో కనకదుర్గమ్మకు అగ్నిలో ఆజ్యంపోసినట్లయింది. అయినా ఈ వీరమ్మ ఇంతలో కనిపెట్టేస్తుంది ఏసంగతయినా. ఏమాటావిని ఊరుకోదు బైటకి అనేస్తుంది చప్పున.

''పోనీలెండమ్మా, వాళ్ళు రాకపోతేనేబాగుంది. మీరు వేళకు భోజనంచేసి మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్నారు. నాకూ కాస్త తెరిపిగాఉంది. చెప్పద్దూ? ఒకటే సందడి!"

కనకదుర్గమ్మ భర్త వామనరావు ప్రభుత్వ పారిశ్రామిక శాఖాడైరక్టరు. వారం రోజుల క్రిందటే రిటైరయ్యాడు. ఆయన పెద్ద ఉద్యోగి కనుక ఆమెను ఆ ఊరి మహిళా సంఘానికి అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు సభ్యులు. ఆయన చేతికింద పనిచేసే ఉద్యోగుల భార్యలు కనకదుర్గమ్మ దగ్గరికి వచ్చి "మీ అంతటి వారు లేరన్న"ట్టుగా కబుర్లు చెబుతూ ఉండేవాళ్ళు. మండలి సభ్యులు కనీసం నెలకు రెండు సమావేశాలయినా ఆమె అధ్యక్షతన జరుపుతు ఉండేవారు. సంఘసేవ చేసిన వాళ్ళను రచనలుచేసే వాళ్ళను ఆహ్వానించి ఆమెచేత సన్మానాలు చేయించుతూ

ఉండేవారు. సన్మానం చేసినవారికీ చేయించుకున్నవారికీ ఫోటోలు తీయించి పత్రికలలో కనకదుర్గమ్మను గురించి చాలా గొప్పగా రాసి వేయించుతూ ఉండే వారు. ఆ సభల్లో కనకదుర్గమ్మ వినయవిధేయతలూ సంఘసేవ, తోటి స్త్రీలను అభివృద్ధిలోకి తీసుకురావాలన్న ఆశయమూ మొదలైన వాటిని గురించి కార్యదర్శిని ఒక గంటసేపు ఉపన్యాసమిచ్చిన తరువాత సన్మాన కార్యక్రమాలను నడిపించేవారు.

కొత్త సినిమా వచ్చిందంటే కనకదుర్గమ్మ పర్సు తెరనక్కరలేకుండా రెండు టికెట్లు తెచ్చి ఆమెను బయలుదేరదీసేవారు.

మనం ఈ సినిమాలు చూసి "చిత్రసీమలో స్త్రీలను చాలా దారుణంగా చిత్రిస్తున్నారు. మేము మా సంఘంవైపునుంచి కేంద్ర సమాచారశాఖామాత్యులకు మా స్త్రీ జాతిని అవమానపరచే చిత్రాలను చెక్ చెయ్యమని విజ్ఞప్తి చేస్తున్నా"మని పత్రికలలో అచ్చువేయిద్దాము. ప్రజావాక్యానికి విలువఇచ్చే మంత్రి అందులో మీరు వ్రాసిన ఉత్తరానికి వెంటనే తన విచారాన్ని తెలుపుతూ, ఇకముందు అటువంటి అసభ్యకరమైన చిత్రాలను సెన్సార్ బోర్డు వారిచే తీయించివేస్తామని జవాబివ్వటమే కాకుండా మిమ్మల్ని సెన్సార్ బోర్డు మెంబరుగా కూడా నియమిస్తారు" అని ఆమెను కొండ ఎక్కించేవారు.

"మీరు మెంబరయితే మన మహిళాసంఘానికి ఒక స్టేటస్ వస్తుంద"ని అయినట్టే అభినందించేవారు కొందరు.

ఆ మాటలకు ఆమెకు ఉక్కిరిబిక్కిరయినంత పనయింది.

ఆ విధంగా వామనరావు ఏ ఊళ్ళో ఉంటే ఆ ఊరి మహిళామండలి సభ్యులు, పత్రికలద్వారా ఆమె పేరు విని ఆమెను కలుసుకోవటానికి ప్రత్యేకంగా వచ్చి "మా ఊళ్ళోకూడా ఒక మహిళామండలిని మీ చేతిమీదుగా స్థాపించి మీరు చేసే కార్యకలాపాలతో దానిని కూడా అభివృద్ధిలోకి తీసుకురండి" అంటూ ఆమెను పదే పదే కోరి ఒప్పించేవారు. ఇంచుమించుగా ఆ సభ్యుల భర్తలందరూ వామనరావు చేతిక్రింది ఉద్యోగులే. కనుక ప్రారంభోత్సవానికి బ్రహ్మాండమయిన ఏర్పాట్లు చేసేవారు, రంగాలంకరణ కళ్ళు జిగేలు మనేటట్టుగా ఏర్పాటు చేసేవారు. పత్రికలద్వారా బాగా ప్రచారం చేసేవారు.

శిశు ప్రదర్శనలు పెట్టి డాక్టరుచేత పరీక్షలు చేయించి ఆరోగ్యంగా ఉన్న ఏడాదిలోపు పిల్లలకు బహుమతులను పంచటం, పిల్లలకు ఆటల పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులివ్వటం వంటి సాంఘిక కార్యక్రమాలు నిర్వహించటం ప్రతిఏటా చేస్తున్నారు.

ఒకసారి సభ్యులందరూ కనకదుర్గమ్మ దగ్గరికి ఒక పెద్ద పథకం వేసుకుని వచ్చారు. సాంఘికాభివృద్ధిమీద వక్తలచేత ఉపన్యాసాలిప్పించి వారిలో ఉత్తమ వక్తలకు ముగ్గురికి బహుమతులిచ్చే సభ ఒకటి ఏర్పాటు చెయ్యాలని అధ్యక్షురాలికి చెబుతూ "ఈ సభకు కేంద్ర సంక్షేమశాఖామాత్యులను ఆహ్వానిస్తే బాగుంటుంది. మీ పేరు వింటే తప్పకుండా వస్తారు. మీరు స్వయంగా వెళ్ళి ఆహ్వానిస్తే కాదన లేరు. కార్యదర్శిని మీ వెంట వస్తారు. ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ గెస్టుహౌసుకు మీ వారి చేత ఉత్తరం రాయించి బుక్ చేసుకుంటే హాయిగావెళ్ళి రావచ్చు"అని మొహమాట పెట్టేశారు.

ఆమె సంతోషంతో తలమునకలవుతూ "మీరంతావచ్చి నన్ను మరీ బలవంతం చేస్తుంటే మీ మాట కాదనలేకుండా ఉన్నాను" అన్నది కనకదుర్గమ్మ పైకి.

వాళ్ళందరూ డబ్బు ఎట్లా సంపాదించేవారో తెలియదు. రెండు ఫస్టు క్లాసు టికెట్లతోమరునాడే ప్రత్యక్షమయ్యారు. ఆనాడే ఆంధ్రప్రదేశ్ గెస్టుహౌసుకు ఉత్తర మొకటి వెళ్ళింది. మంత్రిగారి పి. ఏ.కి టెలిఫోను చేశారు. కాని-ఆయనకు టూర్ ప్రోగ్రామ్ ఉందని జవాబు వచ్చింది. వాళ్ళకు చాలా ఆశాభంగమయింది. అయినా "పోనిలెండి. మరోసారికి ఆహ్వానిద్దాం. ఆయనెక్కడికి పోతారు? మనమెక్కడికి పోతాం" అంటూ కార్యదర్శి చెప్పగానే హతాశురాలయింది కనకదుర్గమ్మ.

"ఆమాటా నిజమే. మంత్రికదా. ఎన్నో కార్యక్రమాలుంటాయి" అన్నది పైకి.

ఏదో ఒకటి-ఎప్పుడైనా గురితప్పినా అనుకున్న కార్యక్రమాలు చాలా ఘనంగా జరిపించేవారు. ఈ మహిళామండలి సభ్యులు దానితో కనకదుర్గమ్మ పేరు ప్రఖ్యాతులు వినని వాళ్ళూ తెలియని వాళ్ళూ లేరు. దానికి ఆమె అంద చందాలూ హోదా బాగా తోడ్పడ్డాయి. కార్యదర్శి అధ్యక్షురాలిని గురించి చెప్పిన తుదిపలుకులు మరింతగా ఆమె గౌరవాన్ని పెంచాయి.

వాటిని తలుచుకుని ఆలోచిస్తూ చిన్నబోయిన ముఖంతో ఇంట్లోనే ఉండి పోయింది. ఆనాడు కనకదుర్గమ్మ.

ఒకనాటి మధ్యాహ్నం మూడు గంటలవేళ మహిళామండలి కార్యదర్శినితో కూడా కాంతమ్మ వచ్చింది.

కనకదుర్గమ్మ చాలా ముభావంగా వాళ్ళను ఆహ్వానించింది. కాఫీ తెప్పించి ఇచ్చింది.

"కనకదుర్గమ్మగారూ. మన మహిళామండలి జనరల్‌బాడీ మీటింగు బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేశాం. ఆ సభలో కొత్తగా వచ్చిన డైరక్టరుగారి సతీమణిని అధ్యక్షురాలిగా ప్రతిపాదన చేయవలసి ఉంటుంది. ఆ పని మీరు చెయ్యాలి. మరునాడు ఆమె అధ్యక్షతక్రింద మీకు సన్మానం జరుగుతుంది. ఈ రెండు సమావేశాలకూ మీరు తప్పకుండా రావాలి, నోటీసులు ఈ సాయంత్రం నౌకరు తెచ్చి ఇస్తాడు" కార్యదర్శిని చెప్పింది.

"మనం ఇది వరకూ జరిపిన కార్యక్రమాలను గురించి కూడా చెప్పండి" అన్నది కాంతమ్మ.

"వాటిని గురించి బుధవారం మీటింగులో ఎలాగు చెప్పాలి. అయినా క్లుప్తంగా చెప్తాను. స్త్రీలకు పిల్లలకు సంగీతం, మెషీను మీద-బట్టలు కత్తిరించి కుట్టడం, అక్షరాస్యతా పథకం క్రింద ఎవరు ఏ వేళకు వచ్చినా, క్లాసులు రోజుకు రెండు సార్లు నడపటం, అందుకు ఒక టీచర్ను ప్రత్యేకంగా నియామకం చేయటం-ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలను ప్రభుత్వం గ్రాంటుమీద నడవదలచినట్టు కొత్తగా ఎన్నికయ్యే అధ్యక్షురాలు సూచించారు, వాటికోసం అప్లికేషన్లు ఏర్పాట్లూ జరుగుతున్నాయి" దిగ్గున లేచింది కార్యదర్శిని.

"సరేమంచిది. నమస్కారం" అంటూ వాళ్ళను సాగనంపింది కనకదుర్గమ్మ.

మహిళామండలికి కొత్త అధ్యక్షురాలా?

అప్పుడే కొత్త కొత్త ప్రోగ్రాముల ఏర్పాట్లా?

ఆమెను తను ప్రతిపాదించాలా?

తను వెళ్ళకపోతే ఏమవుతుంది?

తెల్లవార్లూ ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చిందామె.

"అంతగా అవసరమయితే వాళ్ళే ఒక మనిషిని పంపుతారు" అని.

బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మీటింగు ప్రారంభమవుతుందని తెలిసికూడా పగలు నిద్రపోయి ఆలస్యంగా లేచింది. బట్టలు మార్చుకుని సిద్ధంగా ఉంది. అరగంట ఎదురు చూసింది.

"ఒకవేళ - ఇప్పుడు కనుక తను వెళ్ళకపోతే రేపు తనకు సన్మానం ఉండదేమో?" తను చేసిన సేవను గురించి కొత్త అధ్యక్షురాలికి బాగా తెలిసేటట్లు కార్యదర్శిని ఇచ్చే ఉపన్యాసాన్నీ ఆ సన్మానాన్నీ వదులుకోవటమెందుకు? ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్ళీ రాకపోవచ్చు" అనుకుంది.

చివరకు వెళ్ళటానికే నిశ్చయించుకుని వాకిట్లోకి వచ్చేటప్పటికి కారు డ్రైవరు లేడు.

తను రిటైరయిన డైరక్టరు భార్య. ఆ ఊరి మహిళామండలికి ఐదేళ్ళనుండీ అధ్యక్షురాలిగా గౌరవము పొందింది. అనేక సన్మానాలు చేసింది. చేయించుకున్నది. ఏ ఆటోమీదనో వెళ్ళితే తన పరువేంకాను?

తను వెళ్ళలేదు.

ఇప్పుడెట్లా?

ఆమెను రమ్మంటున్నారని మనిషివచ్చి చెప్పాడు. కారులో రావటానికి డ్రైవరులేడని చెప్పింది.

పదినిమిషాలలో కొత్త అధ్యక్షురాలి కారు వచ్చి వాకిట్లో నిలబడ్డది,

కనకదుర్గమ్మ ఆ కారునుచూసి క్రుంగిపోయింది. తనకు కారు లేనట్టుగా కొత్త డైరక్టరుగారి కారు ఎక్కవలసి రావటమేకాకుండా వాళ్ళకారు కొత్తది. లేటెస్టుమోడల్ ఆమెకు తలవొంపులయింది.

అయినా బయలుదేరింది.

ఈ జరిగిన ఆలస్యానికిశిక్షగా అక్కడికివెళ్ళేసరికి సభ ప్రారంభమయింది. కార్యదర్శిని మాట్లాడుతున్నది.

"సోదరీమణులారా! మన మహిళామండలికి కొత్త అధ్యక్షురాలిగా కొత్తగా వచ్చిన డైరక్టరుగారిభార్యను ఎన్నుకున్నాము. ఈమె ఎడ్వొకేటు. మహిళా సంఘాలనునడపి వాటిని ఉన్నతస్థితికి తీసుకురావటంలో అఖండప్రజ్ఞాశాలి. ఈమె స్త్రీలకుజరిగే అన్యాయాలను కోర్టువరకూ తీసుకువెళ్ళి గెలిపించుకుని రాగలిగినది. ఈమె అధ్యక్షురాలిగాఉంటే స్త్రీలకు సంఘంలో ఎటువంటి అన్యాయాలు జరగవు. ఈమె ఎన్నో మహిళామండలులను స్థాపించి, భవనాలుకట్టించి, గ్రంథాలయాలుస్థాపించి, నిర్మాణ కార్యక్రమాలను జరిపించారు. వాటన్నిటికి ప్రభుత్వగ్రాంటులను సేకరించారు. వాటిని అప్పుడప్పుడువెళ్ళి పర్యవేక్షించి వస్తూ ఉంటారు. కొత్తసూచనలు ఇస్తారు.

అన్నిటికంటె ప్రధానమైనది అసలైన సంఘసేవకురాలు. నిరాడంబరవ్యక్తి నిగర్వి. తలపెట్టిన కార్యక్రమాలను ఎంత కష్టమైనాపడి, తిరిగి తిరిగి సాధించి నిర్వహిస్తారు. వీరి అధ్వర్యంలో మన మండలి ప్రజోపయోగకరమైన సంస్థగా నిలబడుతుందని ఆశిద్దాము.

మనం ఇన్నిసంవత్సరాలనుంచీ మండలిని నడుపుతున్నాం. మండలికి స్థలమైనా సంపాదించలేకపోయాం. ఒక్క నిర్మాణకార్యక్రమమైనా నిర్వహించలేకపోయాం. ఒక మంచికార్యక్రమమైనా నడపలేకపోయాం. మనం ఇంతకాలమూ కబుర్లతోనూ వినోదాలతోను కాలక్షేపంచేశాం. ఈ రోజున కొత్తగావచ్చిన డైరక్టరుగారి సతీమణిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నాము. వీరి నిర్వహణలో ఈ మహిళామండలికి స్వంతభవనమేకాక నిర్మాణ కార్యక్రమాలు ఒక గ్రంథాలయమూకూడా స్థాపింపబడబోతున్నాయి. ఇందుకు మనమందరమూ ఆమోదించినట్లు చప్పట్లుకొట్టండి" అంటూ అధ్యక్షురాలు పద్మాక్షమ్మగారిని పూలమాలలతో సత్కరించింది.

సభ్యులహర్షధ్వానాలతో హాలుమారుమ్రోగింది.

కనకదుర్గమ్మవచ్చినట్టు ఈ సందడిలో ఎవరూచూడలేదు. కార్యదర్శినిగాని కార్యనిర్వాహకవర్గంలోనివారుగాని ఆమెకు స్వాగతంపలికి లోపలికి తీసుకువెళ్ళి కుర్చీమీద నూతన అధ్యక్షురాలి సరసన ఆసీనురాలిని చెయ్యలేదు. ఆమె అందరిలో ఒకతెగా కూర్చుని కార్యదర్శిని ఉపన్యాసమంతావిని, ఒక నిట్టూర్పు విడిచింది. ఎవరూచూడకుండా ఇంటికివచ్చేసింది.

ఆ మరునాడే ఆమెకు సన్మానం. ఆనాటికి స్వంతకారులో బయలుదేరి సన్మానం పొందదలచుకున్నది. డ్రైవర్ని ముందుగానే రమ్మన్నది. పెద్ద జరీ అంచుల పట్టుచీర కట్టుకున్నది. జిగేల్‌మనిమెరిసే రవ్వలకమ్మలు పెట్టుకున్నది. ఒక్క నిమిషమయినా ఆలస్యంచెయ్యకుండా సరిగ్గా సమయానికి వెళ్ళింది. అప్పటికే సభనిండుగాఉంది. కొత్త అధ్యక్షురాలు అధ్యక్షపీఠంమీద ఆసీనురాలయిఉన్నది. ఆమెకు పక్కగా కనకదుర్గమ్మకు కుర్చీవేసి కూర్చుండపెట్టింది కార్యదర్శిని.

కనకదుర్గమ్మను చూసి అందరూ చప్పట్లు కొట్టారు.

కార్యదర్శిని లేచి "మన మాజీ అధ్యక్షురాలైన శ్రీమతి కనకదుర్గమ్మగారు ఏడుసంవత్సరాలుగా మండలికి చేసినసేవకు మనము ఆమెకు కృతజ్ఞతలు తెలుపవలసిఉన్నది. మన మామెకు హృదయపూర్వకమైన వీడ్కోలు ఇవ్వవలసిఉన్నది. నూతనఅధ్యక్షురాలు మాజీ అధ్యక్షురాలికి పూలహారంవేసి శాలువకప్పుతారు" అని ఒక పూలహారం శాలువ అధ్యక్షురాలి చేతికివ్వగా ఆమె సత్కరించింది.

మళ్ళీ సభ్యులంతా చప్పట్లు కొట్టారు. కార్యదర్శిని కృతజ్ఞతలు తెలిపింది. అందరూ లేచారు.

కనకదుర్గమ్మకు తలకొట్టేసినట్లయింది. తనను గురించి అక్కడ తెలియనిదెవరికి? మొన్నటి వరకూ అందరూ 'ఆహా! ఓహో!' అంటూ మాట్లాడినవారే-కాని ఇవాళ ఒక్కరూ నోరెత్తలేదు. కార్యదర్శిని మర్యాదకయినా తనను గురించి ఒక మాట ఆహ్లాదకరంగా చెప్పలేదు.

ఆమెకు కళ్ళ నీళ్ళు పర్యంతమయింది.

నూతన అధ్యక్షురాలిని పరిచయం చేసుకోవటంగాని, ఇంతకాలంగా తనను పొగుడుతూ ఆకాశానికి ఎత్తేసిన సభ్యులతో మర్యాదకయినా వెళ్తున్నానని గాని చెప్పకుండా దిగ్గునలేచి కారెక్కి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఆమెకు భోజనం సహించలేదు. మాట్లాడకుండా వెళ్ళి పడుకుంది. కాని మనసు ఉద్రేకించటంవల్ల నిద్ర పట్టలేదు.

ఆమె జీవితములో ఎప్పుడూ ఇటువంటి అవమానం జరగలేదు. ఏ ఊరు వెళ్ళినా ఆమెను గౌరవించి అంతటి ఆమె లేదన్నట్టుగా పొగిడేవారు. ఆమె

రావటమే తమను గౌరవించినట్లనుకునేవారు. ఆమెను పట్టుశాలువలతో సత్కరించేవారు.

ఎంత గౌరవం? ఎన్ని సన్మానాలు?

స్వభావ సిద్ధంగా ఆమె, పొగడ్తలకు ముందునుంచీ అలవాటు పడిన మనిషి. ఆ యింటి వాతావరణం కూడా అందుకు అనుకూలంగా ఉండేది.

ఏమిటీ ఇవాళ ఇంత అగౌరవము?

ఆమె సహించలేకుండా ఉంది,

దుఃఖం పొంగుకుంటూ వస్తోంది.

వామనరావు ఇంటికి వచ్చేటప్పటికి ఆమె పడుకుని ఉండటంచూసి "ఒంట్లో బాగాలేదా? డాక్టరిని పిలిపించనా?" ఆదుర్దాతో అడిగాడు.

ఆమె తన బాధను వ్యక్తం చెయ్యలేకుండా ఉన్నది.

ఆ రాత్రి ఆయనకు నిద్రలేదు.

తెల్లవారగానే కొడుక్కూ కూతురికీ టెలిగ్రామ్‌లిచ్చి డాక్టర్ని పిలిపించాడు. పరీక్ష చేసిన డాక్టరు "ఇప్పుడు నాకేమీ కనబడటంలేదు. నీరసంగా ఉన్నట్టుంది. పండ్లూ పాలు ఎక్కువగా ఇస్తూ ఉండండి" అన్నాడు.

టెలిగ్రామ్ అందుకున్న కొడుకూ కూతురు పిల్లలను తీసుకు వచ్చారు.

"అమ్మకేం జబ్బు చేసింది? ఎన్నాళ్ళనుంచి?" కూతురు తండ్రినడిగింది.

కొడుకు తన కుర్చీని మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చుంటూ "అమ్మా, బాధగా ఉందా? అసలు జబ్బేమిటి? హాస్పిటల్లో చెకప్ చేయిస్తాను ఇవాళ" అన్నాడు.

కనకదుర్గమ్మకు చెప్పటానికి ఏమీ కనబడలేదు. గతవారం నుంచీ మనసులో ఏదోబాధ, దానిని ఆమె పైకి చెప్పలేక పోతున్నది. ఆహారం సరిగా తీసుకోనందు వల్ల మనిషి చిక్కినట్లు కనబడుతోంది. నీరసించినట్టుగా ఉంది.

వామనరావుకు కూడా ఏమీ అంతుపట్టటంలేదు. చివరకు "పిల్లలమీద బెంగగా ఉందా?" అని అడిగాడు.

ఆ మాటకు కొడుకు "మీరిద్దరూ ఒక నెల్లాళ్ళు వచ్చి మాదగ్గర ఉండండి. అమ్మకు సంతోషంగానూ ఉంటుంది. కాస్త గాలిమార్పు ఉంటుంది" అన్నాడు.

"మా దగ్గరికి ముందు రండి నాన్నా" అని కూతురన్నది.

నాలుగురోజులుండి కొడుకూ, కూతురూ సెలవు లేవంటూ వెళ్ళిపోయారు.

పిల్లలున్న నాలుగు రోజులూ కనకదుర్గమ్మ మనసు బిగపట్టుకుని లేచింది. కాని వాళ్ళు వెళ్ళగానే మళ్ళీ మనసులో అశాంతి బయలుదేరింది.

వామనరావామెను ప్రతిరోజూ సినెమాలకు తీసుకువెళ్ళేవాడు. వి సి ఆర్ తీసుకువచ్చి ఇంట్లోనే కొత్త కొత్త సినెమాలు చూపించేవాడు. అయినా ఆమె మనసు సర్దుకోలేదు.

రిటైరయిన తరువాత అతడు అనేక పుస్తకాలు తెప్పించి చదవటం మొదలు పెట్టాడు. సాయంత్రపువేళ క్లబ్బుకు వెళ్తాడు. సర్వీసులో ఉన్నప్పుడే మంచి ఎత్తైన ప్రదేశంలో ఆధునిక సౌకర్యాలతో మంచి ఇల్లు కట్టాడు. పూలతోట ముందుభాగంలో వేశాడు. వెనక భాగంలో పళ్ళచెట్లు వేశాడు. ఆ తోటను చూసుకుంటూ కొంతసేపు కాలక్షేపం చేస్తాడు. ఆయన దగ్గర పనిచేసిన ఉద్యోగులు వస్తారు. వాళ్ళతో కూలాసాగా కబుర్లుచెప్పి కాఫీ టీలు స్వయంగా అందిస్తాడు, ప్రభుత్వపరంగా అనేక కమిటీలలో అతడు ఉన్నాడు. అక్కడికి వెళ్ళుతూ ఉంటాడు. అతడికి రిటైరయిన తరువాత చురుకుదనమెక్కువయింది. హుషారుగా ఉంటున్నాడు. కనకదుర్గమ్మ దగ్గర కబుర్లు చెప్తూ కూర్చుంటాడు.

ఆమె దిగాలుపడి కూర్చుంటుందిగాని జవాబు చెప్పదు మాట పలకదు.

అదేమిటో వామనరావుకు అర్థంకాక హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి చెకప్ చేయించాడు. కారణమేమీ కనబడటం లేదన్నారు డాక్టర్లు.

అతడికి భార్య ఒక సమస్యగా తయారయింది. దానినతడు భరించలేకుండా ఉన్నాడు.

ఒకరోజున "మనమిద్దరం హిందీ నేర్చుకుందామా? ఇప్పుడది మనకు రాజ భాష. ఒక పండితుడిని పిలిపిస్తాను నాకు మాట్లాడటం వచ్చుగాని రాయటంరాదు" అన్నాడు.

ఆమె కనుబొమలు ముడిచి "ఆఁ ఇప్పుడేం నేర్చుకుంటాను? హిందీరాయటం నేర్చుకోగానే మళ్ళీ పిలిచి అంత ఉద్యోగమిస్తారా? ఆ హోదా వస్తుందా? మన మింక ఇంట్లో పడుండవలసినవాళ్ళమేగాని మళ్ళీ ఆ రోజులు వస్తాయా? ఇప్పుడటు వంటివన్నీ వృధా ప్రయాసలు" అంది లేచి కూర్చుని.

అప్పటికి వామనరావుకు కొంత అర్థమైంది.

"నిన్ను ఇంట్లో పడుండమని ఎవరంటున్నారు? నీకోసమే డ్రైవర్ని ఉంచాను. నేను క్లబ్బుకు నడిచి వెళ్తున్నాను. నీవు ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళు. స్నేహితులను కలుసుకో. వాళ్ళతో కాలక్షేపంచెయ్యి. మహిళామండలికి వెళ్ళుతూ ఉండు. తెలియనివి తెలుసుకో. ఉద్యోగాలూ హోదాలూ జీవితాంతం ఉంటాయా? ఈ ప్రపంచంలో ఎంతమంది ఉద్యోగులు రిటైర్‌కాలేదు? ఎంతమంది రిటైరయి సుఖంగా ఉండటంలేదు? ఎవరయినా ఎన్నాళ్ళని ఆ పదవిని పట్టుకుని వేళ్లాడు తారు?" మందలింపుగా అన్నాడు.

"సుఖం ఆనందం అంటూ కబుర్లు చెప్పకండి. చేతికందకపోతే వేదాంతం కలుగుతుందట. రిటైరయిన తరువాత మన ముఖాలు ఎవరు చూస్తారు? మీ దగ్గర కంటే ఒకరో ఇద్దరో వస్తున్నారు. ఇదివరలో ఇలాగే ఉండేదా? ఇంక నాసంగతి. ఇరుగు పొరుగులు అప్పుడు పెద్ద హోదాగలవారనీ ఇంటికి వెళ్ళితే మాట్లాడ రేమోననీ వచ్చేవారుకాదు. ఇప్పుడా హోదా లేదు కనుక రారు. ఇటువైపైనా చూడరు. మహిళామండలి వాళ్ళు హోదా లేదనేగా నన్ను అధ్యక్ష పదవినుండి దించేశారు? అదివరకు వచ్చి గంటలకొద్దీ కబుర్లుచెప్పి ఇంటిచుట్టూ తిరిగిన మెంబర్లు ఇప్పుడా కొత్త అధ్యక్షురాలివెంట తిరుగుతున్నారు. మీ తోటి ఉద్యోగుల భార్యలు వచ్చి ఎంత ఆహ్లాదకరంగా మాట్లాడేవారు? ఇప్పుడా పదవిలేదు కనుక ఎవరూరారు ఎందుకంటారు? పదవిలేదనే కదా? ఇవన్నీ ఆడవాళ్ళకు తెలుస్తాయి. మీకేం తెలుస్తాయి?"

"నీరసంగా ఉన్నావు. ఎక్కువ మాట్లాడితే ఆయాసమొస్తుంది. నీవు చెప్పిన దంతా నిజమే. హోదా! హోదా! కాని-నీకున్న హోదా ఎక్కడికి పోయింది? అసలు-నీవు స్వయంగా ఒక హోదాను కల్పించుకోవాలి. సంఘంలో ఒక ప్రత్యేకమైన స్థానం నీదంటూ ఒకటి నిర్మించుకోవాలి. నీ వ్యక్తిగతమైన హోదా-నీవు కష్టపడి సంపాదించిన హోదా ఎక్కడికిపోదు. ఎప్పుడూ పోదు నా హోదా

మీద ఆధారపడితే ఇంతేమరి. నేను రిటైరవుతాను. కాని-నా సామర్థ్యంవల్ల సంపాదించినది కనుక కొంతేయైనా రిటైరయిన తరువాత మిగులుతుంది. నాకున్న గౌరవం పోలేదు. అయినా నాకేం దిగులులేదు. నేను డిపార్టుమెంటుకు సంబంధించిన కమిటీలలో ఇంకా ఉన్నాను. నా సలహా సంప్రతింపులు వాళ్ళకవసరము. ఇన్నాళ్ళ నా సర్వీసులో నీవు నా హోదాను పంచుకున్నావు. అందరూ నిన్ను గొప్పగా ఆకాశానికి ఎత్తేశారు. ఛాయలా నా వెంట తిరిగావు. పూలహారాలు వేయించుకున్నావు. ఇప్పుడు నేను రిటైరయ్యాను. దీనిని పంచుకో. జీవితంలో కూడా నాతోపాటు అలవాటుపడు. నీవిప్పుడు ఆ హోదాలేదని తీవ్రంగా బాధపడు తున్నావు. ఎప్పటికయినా వ్యక్తిగతంగా సంపాదించిన హోదాను ఎవరూ కాదనలేరు."

ఇంత కఠోర సత్యాన్ని కనకదుర్గమ్మ మనసు భరించలేక పోయింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. కూర్చున్న చోటనే ఒరిగి పోయింది.

వామనరావు వీరమ్మను పిలిచి "అమ్మగారికి చన్నీళ్ళతో ముఖం తుడిచి వేడి వేడి కాఫీ ఇవ్వు. నేను క్లబ్బుకు వెళ్తున్నాను" తలుపులు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.